క్లుప్తంగా

కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు



మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి

బోట్‌క్లబ్: నగరంలోని మెయిన్ రోడ్డులో ఉన్న సీతారామస్వామి ఆలయంలో శనివారం నుంచి 20వ తేదీ వరకూ దివ్య కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ యర్రా వేంకటేశ్వరరావు శుక్రవారం విలేకర్లకు తెలిపారు. శనివారం సాయంత్రం సీతారాముల ధనుర్బంగోత్సవం, ధ్వజారోహణ జరుగుతాయన్నారు. మధ్యాహ్నం సీతారాముల కల్యాణోత్సవం, 8న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం, సీతారాముల సదస్యం జరుగుతాయని వివరించారు. 12న శేషహోమం, పూర్ణాహుతి, చక్రతీర్థోత్సవం, 13న శ్రీపుష్పయాగం, 20న పూర్ణాహుతి, సీతారాముల సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆయా పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకులు పాణింగపల్లి మాధవాచార్యులు ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు.

నూతన వస్త్రాల వితరణ



పేద మహిళలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో పేద మహిళలకు నూతన వస్త్రాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు మాట్లాడుతూ సంపాదనలో కొంత మొత్తం సేవా కార్యక్రమాలకు కేటాయించడం ద్వారా దాతలకు ఆత్మ సంతృప్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, ప్రసాదనాయుడు, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ



దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేస్తున్న సర్పంచ్, కార్యదర్శి

కరప: ఆర్టీసీ బస్సులో ప్రయాణించేందుకు దివ్యాంగులకు ఇచ్చిన రాయితీ బస్‌పాస్‌లను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సాదే ఆశాజ్యోతి అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం దివ్యాంగుల కోసం కాకినాడ ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. గ్రామంలోని దివ్యాంగులు 30 మంది రాగా, ఆర్టీసీ ప్రతినిధులు ఎంఆర్ఎస్ స్వామి, బీవీఎస్ఎన్ రెడ్డి వారి సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డులు పరిశీలించి, బస్‌పాస్‌లు ఇచ్చారు. వాటిని సర్పంచ్ ఆశాజ్యోతి, పంచాయతీ కార్యదర్శి యు.నిర్మలాదేవి, పి.త్రిమూర్తులు, పేపకాయల తణుకులు తదితరులు లబ్ధిదారులకు అందజేశారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ



కరపలో సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామివార్లు

కరప: పునర్నిర్మాణం జరిగిన రామాలయంలో శుక్రవారం సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామివార్ల విగ్రహాలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. స్థానిక నీలయ్యతోట వీధిలో ఈ వీధి రామాలయం శిథిలావస్థకు చేరడంతో, గ్రామస్తుల వినతి మేరకు 2023లో అప్పటి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రూ.10 లక్షలు మంజూరు చేశారు. గ్రామస్తులు, భక్తుల విరాళాలతో రామాలయాన్ని పునర్నిర్మించారు. దాతలు లకమన బాబూరావు కుటుంబ సభ్యులు రూ.3 లక్షల విలువైన సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామివార్ల పాలరాతి విగ్రహాలను వియత్నాం దేశం నుంచి తీసుకొచ్చి ఆలయానికి అందజేశారు. వేద పండితులు కొక్కిరిగడ్డ సుబ్రహ్మణ్యం, మణికంఠ ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్న సమారాధన జరిగింది.

వేసవి షాక్

- లోడ్ ఎక్కువైతే వైర్లు కాలిపోయే ముప్పు
- షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలకు నష్టం
- సరఫరాలో లోపాలుంటే ఫిర్యాదు చేయాల్సిందే..


కాకినాడ సిటీ: వేసవి వచ్చిందంటే ఎండల తీవ్రత పెరుగుతూనే ఉంటుంది. ఇప్పటికే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉక్కపోత నుంచి ఉపశమనం పొందడానికి విద్యుత్ వినియోగం అధికమవుతుంది. ఇంత వరకు బాగానే ఉన్నా విద్యుత్ వినియోగంలో వైర్ల సామర్థ్యంపై సందేహాలు అన్నీ ఇన్నీ కావు. కన్సీల్డ్ వైరింగా, గోడలపైనే గొట్టాల్లో వైరింగ్ ఏర్పాటు చేశారా? అనేది గుర్తించాల్సిన విషయం. వైరింగ్‌లో లోపాలుంటే షార్ట్‌సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉంటుంది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగే అవకాశాలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో జాగ్రత్తలతో పాటు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

అధిక లోడుతో అనర్థమే..

వేసవిలో విరివిగా విద్యుత్ ఉపకరణాల వినియోగం వల్ల ఒక్కోసారి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుంటాయి. గృహాల్లో కానీ, కార్యాలయాల్లో కానీ విద్యుత్ వాడకాన్ని బట్టి లోడ్‌ను విద్యుత్ విభాగం వారి అనుమతి తీసుకోవాలి. సబ్‌స్టేషన్ నుంచి వినియోగదారునికి లోడ్ సామర్థ్యం మేరకు ట్రాన్స్‌ఫార్మర్‌లో అందుబాటులో ఉంచుతారు. కేవలం 1 కేవీ లోడుకు అనుమతి పొంది, వేసవి తీవ్రత దృష్ట్యా అంతకంటే అధికంగా విద్యుత్‌ను వినియోగిస్తే దాని ప్రభావం ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి, దెబ్బతినే అవకాశం ఉంది. ఏసీలు, ఫ్రిజ్‌లు, టీవీలు ఇతరత్రా విద్యుత్ ఉపకరణాలు వాడే సమయంలో కచ్చితంగా స్టెబిలైజర్లను వినియోగించాలి. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులుంటే సంబంధిత విద్యుత్ సిబ్బందికి ఫిర్యాదు చేయాలి.



ట్రాన్స్‌ఫార్మర్‌తో ఉన్న స్తంభం



ఇళ్ల మధ్య అపాయకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

కాకినాడలో విద్యుత్ వ్యవస్థ ఇలా..

కాకినాడ సిటీ, రూరల్ ప్రాంతాల్లో 9 సబ్‌స్టేషన్లు ఉన్నాయి. కాకినాడ నగరంలో కుళాయి చెరువు వద్ద డీ1 సబ్‌స్టేషన్, జగన్నాథపురం బాలయోగి బొమ్మ వెనుక డీ2, సాంబమూర్తినగర్ ఐదో వీధిలో డీ3, రమణయ్యపేట కాలువ గట్టు వద్ద డీ4, పాత పోర్టు రైల్వే స్టేషన్ వెళ్లే దారిలో డీ5, ప్రతాప్‌నగర్‌లో డీ6, డెయిరీ ఫారం సెంటర్ వద్ద డీ7, జేఎన్‌టీయూకే వద్ద డీ8, బీచ్ రోడ్డు ప్రాంతంలో డీ9 సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వీటితో పాటు వాకలపూడి వద్ద ఒక సబ్‌స్టేషన్, ఏడీబీ రోడ్డులో పవర్‌హౌస్‌లు ఉన్నాయి. కాకినాడ నగరం, రూరల్ ప్రాంతాల్లో దాదాపు 2.32 లక్షలకు పైగా విద్యుత్ వినియోగదారులున్నారు.

ఇలా చేయవద్దు

- గృహాల్లో 15 యాంప్స్ విద్యుత్ ఉపయోగించే చోట 30 యాంప్స్ భారం పడే పరికరాలు వినియోగిస్తే వైర్లు కాలిపోయే ప్రమాదముంది.
- ఒక స్విచ్ బోర్డుకు ఎక్కువ ప్లగ్‌లు ఉపయోగిస్తే లోడ్ పెరిగి, స్పార్క్ ఏర్పడి ప్రమాదాలు జరగవచ్చు.
- ఎండలో విద్యుత్ తీగలు ఉంటే, కాలక్రమేణా తీగలపై రబ్బర్ మెత్తబడి ప్రమాదాలు ఉత్పన్నం కావచ్చు.
- ఇంట్లో విద్యుత్ ఉపకరణాలన్నింటినీ ఒకేసారి ఆన్ చేసి ఉంచవద్దు.
- కంప్యూటర్ పరికరాలు, టీవీల వద్ద విద్యుత్ తీగలను చిందరవందరగా ఉంచరాదు.
- రక్షణ పరికరాలైన ఎంసీబీ (మైక్రో సర్క్యూట్ బ్రేకర్), ఎంసీసీబీ (కరెంట్ కంట్రోలర్ బ్రేకర్) ఫ్యూజులను బైపాస్ చేయకూడదు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వేసవి ప్రారంభమయ్యే ముందు తప్పనిసరిగా ఇళ్లు, కార్యాలయాల్లో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లతో తీగల వ్యవస్థను తనిఖీ చేయించాలి.
- వైరింగ్ చేయించేటప్పుడు పూర్తిగా ఐఎస్ఐ, బీఐఎస్ మార్క్ కలిగిన ఎలక్ట్రికల్ సామగ్రిని మాత్రమే ఉపయోగించాలి.
- ఇంట్లో విద్యుత్ వినియోగం ఆధారంగా విద్యుత్ విభాగం నుంచి లోడ్‌ను తీసుకోవాలి.
- అందుకు తగ్గట్టుగా వైరింగ్ చేశాక ఏసీలు, కూలర్లు, వాటర్ హీటర్లు, మైక్రో ఓవెన్, ఇతర ఎలక్ట్రికల్ వస్తువులు వినియోగించాలి.
- ఎలక్ట్రానిక్ ఉపకరణాన్ని బట్టి నాణ్యత కలిగిన విద్యుత్ తీగలను వినియోగించాలి.
- నాసిరకం పరికరాలతో విద్యుత్ వృథా కావడంతో పాటు, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, వైరింగ్ పటిష్ఠంగా ఉండేలా చూసుకోవాలి.
- గృహాలు, వాణిజ్య సంస్థలు, కార్యాలయాల్లో తప్పనిసరిగా న్యూట్రల్ పరికరాల కోసం సరిపడినంత ఎర్త్ ఎలక్ట్రోడ్ ఏర్పాటు చేసుకోవాలి.
- ఎండాకాలంలో రక్షణ పరికరాలు సరిగ్గా పని చేయాలంటే ఎర్తింగ్ సరైన పద్ధతిలో ఉంచేందుకు అవసరమైన ప్రదేశంలో నీరు, దొడ్డు ఉప్పు ఉయోగించాలి.
- విద్యుత్ వాడేందుకు మూడు పిన్నుల ప్లగ్‌లు, సాకెట్లు మాత్రమే ఉపయోగించాలి.
- విద్యుత్ స్తంభాల నుంచి మీటర్ వరకుండే సర్వీస్ వైర్లు అతుకుల్లేకుండా చూసుకోవాలి.

అప్రమత్తత అవసరం

వేసవిలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. విద్యుత్ తీగలు వ్యాకోచం చెందే అవకాశం ఉంది. షార్ట్‌సర్క్యూట్ జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి. గృహాల్లో వినియోగించే విద్యుత్ ఉపకరణాలకు అనుగుణంగా ప్రత్యేకంగా వైరింగ్‌ను చేయించుకోవాలి. ఎటువంటి సమస్యలు ఉన్నా సిబ్బందికి తెలియజేయాలి.

– ప్రసాద్, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్, కాకినాడ

విద్యుత్ సంబంధిత ప్రమాదాలకు అత్యవసర నం: 1912

మొబైల్ వాహనం ప్రారంభం



మొబైల్ అవుట్ రీచ్ వాహనాన్ని ప్రారంభిస్తున్న జేసీ రాహుల్ మీనా

కాకినాడ సిటీ: హెచ్ఐవీ నిర్మూలనకు మొబైల్ అవుట్ రీచ్ వాహన సేవలు దోహదపడతాయని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. కౌన్సెలింగ్, టెస్టింగ్ సేవల విస్తరింపులో భాగంగా భారతదేశ మొబైల్ ఐసీటీసీ హెచ్ఐవీ మొబైల్ వాహనాన్ని కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన ప్రారంభించారు. పారా మెడికల్ హెల్త్ కేర్ ప్రొవైడర్ల బృందంతో కూడిన ఈ వాహనం సమస్యాత్మక ప్రాంతాల్లో సేవలందించేందుకు ఉపయోగపడుతుందని ఆయనన్నారు. తద్వారా హెచ్ఐవీ పట్ల అవగాహన, కేసుల గుర్తింపు చికిత్సకు సత్వర అవకాశాలుంటాయని చెప్పారు. జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ ఆర్.రమేష్ మాట్లాడుతూ కష్టతరమైన ప్రాంతాల్లో తాత్కాలిక క్లినిక్ ఏర్పాటుకు మొబైల్ వాహన సేవలు ఉపయోగపడతాయన్నారు.

విటమిన్-సితో దంతాలకు రక్ష

బోట్‌క్లబ్: దంతాలు, చిగుళ్ల ఆరోగ్యానికి విటమిన్-సి మంచిదని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక సత్య దంత వైద్యశాలలో శుక్రవారం ప్రపంచ విటమిన్-సి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు పండ్లు అందించారు. విటమిన్-సి దంతాలను దృఢంగా ఉంచుతుందని, నోటి కణ జాలాలను ఆక్సీకరణ ఒత్తిడి, వాపు నుంచి రక్షిస్తుందన్నారు. సంఘ సభ్యులు శ్రీవల్లీ, ఏరూష పాల్గొన్నారు.

ఆక్వా జోన్ల ఏర్పాటుకు గ్రామసభలు

7 నుంచి కరప, కాకినాడ రూరల్ మండలాల్లో నిర్వహణ

కాకినాడ రూరల్: నియోజకవర్గంలో ఆక్వా జోన్ల ఏర్పాటు కోసం ఈ నెల ఏడో తేదీ నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు మత్స్యశాఖ ఎఫ్‌డీఓ నూకరాజు తెలిపారు. కలెక్టర్ షణ్మోహన్ ఆదేశాల మేరకు గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏడున ఉదయం 11 గంటలకు తూరంగి, మధ్యాహ్నం 3 గంటలకు నేమాం గ్రామాల్లో, 8న ఉదయం 11 గంటలకు రేపూరు, మధ్యాహ్నం 3 గంటలకు కొవ్వూరు, 9న ఉదయం 11 గంటలకు పెనుమర్తి గ్రామాల్లో గ్రామ సభలు ఉంటాయని వివరించారు. గ్రామ సభల ద్వారా ఆక్వా జోన్ల ఏర్పాటుకు గ్రామస్తుల అభిప్రాయాలను తీసుకుంటామన్నారు. మండల స్థాయి కమిటీ చైర్మన్‌గా తహసీల్దార్, సభ్యులుగా ఎంపీడీఓ, వ్యవసాయాధికారి, మండల ఇరిగేషన్ ఇంజినీర్, ఎఫ్‌డీఓ లేదా అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిషరీస్ వ్యవహరిస్తారని తెలిపారు.

కరప: మండలంలో వివిధ గ్రామాల్లో ఆక్వా జోన్ల ఏర్పాటుకు కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎఫ్‌డీఓ నూకరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో రైతులతో చర్చించి, ఆక్వా జోన్ ఏర్పాటుకు భూములు అనువైనవి, లేనివి గుర్తిస్తామన్నారు. అభ్యంతరాలుంటే స్వీకరిస్తామని చెప్పారు. తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ మండల కమిటీ చైర్మన్‌గా, తనతో పాటు, ఎంపీడీఓ ఎం.అనుపమ, ఎంఏఓ ఆర్‌వీ రాజేష్, ఇరిగేషన్ ఏఈఈ ఎస్.నాగభవాని, కన్వీనర్‌గా అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ కె.మధుబాబు సభ్యులుగా వ్యవహరిస్తున్నారు. ఏడున అరట్లకట్ట, జెడ్.భావారం, గురజనాపల్లి, ఉప్పలంక, జి.భావారం, సిరిపురం గ్రామాల్లో, 8న కొరిపల్లి, కరప, పెనుగుదురు, నడకుదురు, పెద్దాపురప్పాడు, గొర్రిపూడి గ్రామాల్లో, 9న వేములవాడ, వేళంగి, కొంగోడు, పాతర్లగడ్డ గ్రామాల్లో, 11న కూరాడ, చినమామిడాడ, యండమూరు గ్రామాల్లో ఉదయం 11 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు రెండు విడతలుగా గ్రామసభలను వీఎఫ్ఏలు వి.గాయత్రీరమాదేవి, పి.నాగశ్రీ, బి.శిరీష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఎఫ్‌డీఓ వివరించారు.

గ్రేడ్-4 కార్యదర్శులుగా ఆరుగురికి పదోన్నతి



గ్రేడ్-4 కార్యదర్శులను సత్కరిస్తున్న ఎంపీపీ, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు

కరప: మండలంలో వివిధ గ్రామాల్లో గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్న ఆరుగురికి గ్రేడ్-4 కార్యదర్శులుగా పదోన్నతి లభించినట్టు ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు తెలిపారు. గ్రేడ్-5 కార్యదర్శులుగా పనిచేస్తున్న పి.త్రిమూర్తులు(వేళంగి)కు పిల్లంక, పోలిశెట్టి సునీల్(వాకాడ)కు ఉప్పాంగల, పీసీహెచ్ సుధాకర్(పాతర్లగడ్డ)కు జార్జిపేట, కె.భానుసంతోష్(వేములవాడ)కు కె.ఎర్రగొండ, సంతోష్‌మహదేవ్(వలసపాకల)కు రంప, విజయలక్ష్మి(నడకుదురు)కు పోలేకుర్రు పదోన్నతిపై బదిలీ అయ్యారు. పదోన్నతిపై ఇతర మండలాలకు వెళుతున్న వీరికి శుక్రవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులతో కలిసి సత్కరించారు. ఏఓ బీఎల్ నరసింహం, ఎంపీటీసీ అనసూరి శ్రీనివాస్, సర్పంచ్‌లు ఎన్.ఏసుబాబు, అడబాల ప్రసాద్, ఎస్.రాజేష్, కార్యదర్శులు పి.వీరభద్రరావు, బ్రహ్మానందం, పి.ఉమామహేశ్వరి, బి.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ముఖ్యం

ఎస్‌సీపీసీఆర్ మెంబర్ ఆదిలక్ష్మి



సదస్సులో మాట్లాడుతున్న ఆదిలక్ష్మి

కాకినాడ క్రైం: బడి పిల్లలకు పాఠాలతో పాటు చట్టాలపై అవగాహన కల్పించాలని స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్(ఎస్‌సీపీసీఆర్) సభ్యురాలు టి.ఆదిలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, విద్యా శాఖ సంయుక్తాధ్వర్యంలో ఎస్‌సీపీసీఆర్ నిర్వహణలో బాలల హక్కులు, పరిరక్షణ సమస్యలు, చట్టాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ విజయకుమారి, ఐసీపీఎస్ డీసీపీవో వెంకట్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆదిలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు చట్టాలపై మక్కువ పెంచుకుని, హక్కులను అవలోకనం చేసుకోవడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు దోహదపడాలన్నారు. బాల్య వివాహాలు, హింస, బాల కార్మిక వ్యవస్థ నుంచి బాల్యానికి విముక్తి కల్పించాలన్నారు. పీడీ విజయకుమారి మాట్లాడుతూ, విద్యార్థులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. నేర్చుకోవడం ద్వారా జ్ఞానం, పోషకాహారం ద్వారా ఆరోగ్యం పెంపొందుతాయన్నారు. జీసీడీవో జి.ఉమాదేవి మాట్లాడుతూ, ఆడ, మగ తేడా లేకుండా పిల్లలు అకృత్యాలకు గురికావడం ఆందోళన కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శక్తి యాప్‌పై మహిళా పోలీసులు అవగాహన కల్పించారు. ఆపద వేళలో డయల్ 1098, 112, 100 సేవలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఈవో ఎస్.వెంకటేశ్వరరావు, ఎంఈవో సీహెచ్ రవి, పీవో ఐసీ కె.శ్రీనివాస్, పీవో ఎస్ఐసీ జె.విజయ, ఎల్‌సీపీవో ఎం.సుధాకర్, చైల్డ్ లైన్ కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు జిల్లా బాలల పరిరక్షణ విభాగం, శిశు గృహ సిబ్బంది పాల్గొన్నారు.

7న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ: వికాస కార్యాలయంలో ఈ నెల ఏడున జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం ఇక్కడ తెలిపారు. ఈ జాబ్‌మేళాలో రాయల్ ఇన్సూరెన్స్ బ్రోకింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఫైనాన్షియల్ అసోసియేట్, క్లైంట్ కేర్ అసోసియేట్, మార్కెటింగ్ అసోసియేట్, ఎస్ఎస్ టాక్స్ కన్సల్టెన్సీ ప్రైవేట్ లిమిటెడ్‌లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, సీఆర్ఎం, డేటా అనలిస్ట్, ఆఫీస్ బాయ్, మక్షిషీల్డ్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్, స్కైక్వాడ్ ఎలక్ట్రానిక్స్ కంపెనీలో టెక్నీషియన్, ఐటీసీ లిమిటెడ్, ఫుడ్స్ డివిజన్‌లో ఆపరేటర్, ఇండో ఎంఐఎం, హోండాయ్ గ్లోవిస్, హోండాయ్ మోబిస్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ మార్కెటింగ్‌ల్లో ఉత్తీర్ణులైన 35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సోమవారం కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయానికి ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్లు, జెరాక్స్‌లతో హాజరుకావాలన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కాకినాడ రూరల్: అచ్చంపేట జంక్షన్ వద్ద ఉన్న నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటరులో బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి శుక్రవారం ఘన నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి శనివారం జరగనుంది. సెలవు రోజు కావడంతో ఆయన జయంతిని పీజీ సెంటరులో శుక్రవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రశాంతిశ్రీ, అధ్యాపకులు పోచయ్య, నానిబాబు, హారిక, మధుకుమార్, రామరాజు, మొహమ్మద్ నదీమ్, హరిబాబు, గోపి, శ్రీదేవి, రాధా మాధవి తదితరులు నివాళులర్పించారు.

బోట్ క్లబ్ పార్కు ఆధునీకరణకు చర్యలు

పరిశీలించిన కలెక్టర్ షణ్మోహన్



బోట్ క్లబ్ పార్కును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ షణ్మోహన్, చిత్రంలో ఇతర అధికారులు

కాకినాడ రూరల్: కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలోని బోట్ క్లబ్ పార్కును జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. బోట్ క్లబ్ పార్కును ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. బోట్ క్లబ్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. బోట్ క్లబ్ పార్కు ఆధునీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అనంతరం కాకినాడ పట్టణం మూడో డివిజన్ సురేష్‌నగర్‌లో కాకినాడ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన కన్వర్టబుల్ ఇండోర్ స్టేడియాన్ని కలెక్టర్ పరిశీలించారు. దీనిని వినియోగంలోకి తెచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట సీపీవో పి.త్రినాథ్, క్రీడా అభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ కుమార్, ఎస్ఈ కామేశ్వరరావు, ఈఈ మాచిరాజు తదితరులు ఉన్నారు.

కలెక్టర్, ఎస్పీని కలిసిన ఎమ్మెల్సీ

కాకినాడ సిటీ: కొత్తగా ఎమ్మెల్సీగా ఎన్నికై, తొలిసారి కాకినాడ జిల్లాకు వచ్చిన ఎమ్మెల్సీ నాగబాబు శుక్రవారం రాత్రి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ జి.బిందుమాధవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ వెంట టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్, ఇతర నాయకులు ఉన్నారు.

8 నుంచి స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ

కాకినాడ సిటీ: నగరంలోని సుందరయ్య భవన్‌లో ఈ నెల 8 నుంచి స్పోకెన్ ఇంగ్లిష్ ఉచిత శిక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రజా సంఘాల నాయకుడు కె.సత్తిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి సెలవుల నేపథ్యంలో ప్రతి రోజు 6 నుంచి 7 గంటల వరకు 30 రోజుల పాటు ఈ క్లాసులు జరుగుతాయన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు టి.విశ్వేశ్వరరావు సహకారంతో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్నవారు 94903 00599 నంబర్‌కు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

12 మందిపై కేసులు

సామర్లకోట: మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసుల్లో శుక్రవారం 12 మందిని కాకినాడ కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ కె.కృష్ణభగవాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏడుగురికి రెండు రోజుల జైలు, ఐదుగురికి రూ.పది వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు కోర్టు న్యాయమూర్తి డి.శ్రీదేవి తీర్పు ఇచ్చారన్నారు.

స్కానింగ్ సెంటర్లపై నిఘా


జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సుబ్బరాజు

కాకినాడ సిటీ: గర్భస్థ పిండ లింగ నిర్ధారణకు సంబంధించి అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టామని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కేవీ సుబ్బరాజు అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వైద్యారోగ్య శాఖ, రెవెన్యూ, లీగల్, స్త్రీ-శిశు సంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ, డివిజన్ స్థాయి పీసీ, పీఎన్‌డీటీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. అల్ట్రా సౌండ్ పరీక్షలు లింగ నిర్ధారణకు ఉపయోగించడం చట్టరీత్యా నేరమన్నారు. అటువంటి స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ, క్షేత్ర స్థాయిలోని సంబంధిత శాఖల సిబ్బందికి అవగాహన కల్పించాలని ఆదేశించారు. డివిజన్ స్థాయిలో గుర్తింపు పొందిన 116 స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు.పిండ లింగ నిర్ధారణ చట్టంపై గ్రామ స్థాయిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామ స్థాయిలో ఏఎన్ఎం, ఆశా వర్కర్లు సంయుక్తంగా గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. చట్ట వ్యతిరేకంగా గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ కేంద్రాలు, నమోదు కాని స్కానింగ్ కేంద్రాలు, అర్హత లేని వైద్యుల వివరాలను టోల్ ఫ్రీ నంబర్ 18004253365కు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఇందిరాశ్రీశైలజ, డి.విజయ్‌ప్రదీప్, వన్‌టౌన్ ఏఎస్సై సీహెచ్ నరసింహారావు, కె.సింహాద్రి, యూత్ వలంటీర్లు పాల్గొన్నారు.

తొలి దశలో గుర్తిస్తే నయం

కాకినాడ రూరల్: కీళ్ల నొప్పులు మహిళల్లో అధికమని, తొలి దశలోనే గుర్తిస్తే మందులతో నయం చేయవచ్చని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అడ్డాల మాట్లాడుతూ, వయసు పెరిగే కొద్దీ కీళ్ల నొప్పుల సమస్యలు తలెత్తుతాయని, కొందరికి జన్యుపరమైన కారణాల వలన ఈ వ్యాధి వస్తుందన్నారు. కీళ్లలో వాపు, చర్మంపై ఎర్రటి మచ్చలు, జుట్టు ఎక్కువగా రాలడం, దీర్ఘకాలిక జ్వరం, ఆకలి తగ్గడం, రక్త కణాలు తగ్గడం, కండరాల బలహీనత వంటివి లక్షణాలుగా గమనించాలన్నారు. దీని నివారణకు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు, వ్యాయామం చేయాలని, ఒత్తిడిని అధిగమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ సినిమాలు



ఆనంద్ సినిమాస్	: రాబిన్‌హుడ్, సికిందర్, మ్యాడ్ స్క్వేర్, ఎల్2, కోర్టు
దేవీ మల్టీప్లెక్స్	: ఎల్‌వైఎఫ్, శారీ, మ్యాడ్ స్క్వేర్, ఎల్2,
లక్ష్మి	: కోర్టు
సత్యగౌరి	: ఎల్‌వైఎఫ్
తిరుమల	: ఆర్య2
సీఅండ్‌సీ	: మ్యాడ్ స్క్వేర్
సీఅండ్‌సీ-2	: వీర ధీర శూర
శ్రీప్రియ	: ఎల్ 2
పద్మప్రియ	: మ్యాడ్ స్క్వేర్